# వైతాళికునివై జీవించు

అలజంగి ఉదయ్ కుమార్

చేవలేనివాళ్ళు - చేతకానివాళ్ళు
ఓర్వలేనివాళ్ళు - ఓరిమి లేనివాళ్ళు
చేయలేనివాళ్ళు - చూడలేనివాళ్ళు
సత్తాలేనివాళ్ళు - చచ్చుబడినవాళ్ళు
గతం అతుకుల బొంతలో
పొద్దెక్కినా గూడా ముసుగుతీయనోళ్ళు
మెచ్చలేనివాళ్ళు - ముచ్చుముఖంగాళ్ళు
చిదిగిన స్వీయ ఢంకాలను
చిరకాలం బాదుకొనేవాళ్ళు
తమ ఎత్తులు తామే
నిత్యం కొలుచుకునేవాళ్ళు
అత్తెసరు బతుకుల్ని
మరగుజ్జుల గుంపులో
మూతులు నాకుతూ మురిసేవాళ్ళు
ప్రజ్వరిల్లే ప్రతిభా కాంతుల్ని
కళ్ళుండీ కానలేనివాళ్ళు
పీత బతుకుగాళ్ళు
ఎవరూ వీళ్ళంతా వీరితో నాకెందుకీ తంటా అనబోకు
ఊరికే స్పందించి అదేపనిగా గుండెలు బాదుకోకు
నీవెదుగుతున్నావనేందుకు వీళ్ళే కదా సాక్ష్యం
విజయానికి చేరువవుతున్నావనేందుకు వీరే సంకేతం
మనసారా క్షమిస్తూ.... జాలి కాస్త కురిపిస్తూ
తోక కాస్త జాడిస్తే.. జూలు కాస్త విదిలిస్తూ
నీవెరిగిన గమ్యం ...వైపు,
నవ కవనాలను సాగించు
జయకేతనాలను ఎగిరించు
వైతాళికునివై జీవించు ***



# నిరీక్షణ

జ్యోతిర్మయి

**ఈ రేయి ఎన్నటికి తరిగేనో...**

నా ఉద్వేగం చూసి
క్షణాలన్నీ చుట్టూ చేరి ఆటపట్టిస్తున్నాయి !
చీకటి చిక్కనై చిందులు వేస్తోంది!
వెన్నల చిన్నబోయి
మబ్బుల మాటున మొహం చాటేసింది!
విరిసిన మల్లెలు
గుసగుసలు పోతున్నాయి !
నిశీధి అంచుల్లోకి
నిశ్శబ్దం మెల్లగా జారిపోతోంది!!
వెలుగు రేఖ ఒక్కటి
అలవోకగా తొంగి చూసింది...
నిదురించిన తోట
బద్దకంగా ఒళ్ళు విరుచుకుంది!
ఏమయిందో ఏమో
చుక్కలు మెల్లగా తప్పుకున్నాయి !
రేతిరి తన రాజ్యాన్ని వదిలి...
తెలియని తీరాలకు తరలి పోయింది!
ఎదురు చూసిన యెదలో
సందడి మొదలైయ్యింది...
తూరుపు దిక్కున
సన్నాహాల కోలాహలం!
వాకిట వేచిన నెచ్చెలి కోసం
వెలుతురు బాటలో సూరీడు!! ***



# వీడుకోలు

వేమూరి విజయలక్ష్మి

**అంతా  బాగానే ఉంది కదా**
అందరం తృప్తిగా ఉన్నాము కదా
ఎవరి మనసులు బాధ పడలేదు కదా
ఎవరూ ఎవరినీ  నొప్పించలేదు కదా
నవ్వుకుంటూ గడుపుదాం మిగిలిన నాలుగు రోజుల్నీ
ఆ నవ్వులతో కప్పుదాం గాయపడిన మనసు పొరలను
సరదాగా మాట్లేడేస్తూ నవనీతం రాద్దాం  ఆ పిచ్చి మనసుకు
మళ్ళా సలహాలు చెప్పేద్దాం
మళ్ళా సలహాలు వినేద్దాం
మరింక ప్రశ్నలు వద్దు
మరి జవాబులు అడగవద్దు
ఉదారంగా ప్రవర్తిద్దాం
ఉదాసీనంగా ఉండద్దు
మూగబోయిన గొంతును మళ్ళీ  విప్పి
గట్టిగా ధైర్యంగా మాట్లేద్దాం
మళ్ళా రావాలి సుమా
మళ్ళా వెళ్ళాలి సుమా
అని గుర్తు చేస్తూ, గుర్తు  చేసుకుంటూ
జరగాల్సిన పనులను జరిపేస్తూ, ముడుచుకుపోయిన
ఆ ముఖాలకు  ఆప్యాయత అనీ ముసుగును మళ్ళీ  కప్పుతూ కనిపిస్తూ
విడిపోదాం
వీడుకోలు మాటల్ని వల్లె వేద్దాం
రండి తప్పకుండా
వస్తాం తప్పకుండా
ఇంక సెలవు
పొంగుతున్న  దుఃఖాన్నిఅదిమిపెడుతూ
కంట్లో నీళ్ళను తుడుచుకుంటూ
చెప్పేద్దాం - టా టా  బై బై లు. ***



# భగ్నప్రేమ

బెల్లంకొండ లోకేష్ శ్రీకాంత్

చైత్రమాసపు కోయిలనై చివురించిన తలపులన్నీ ఎలుగెత్తి పాడాను
వైశాఖ గాడ్పులలో వలపు చలివేంద్రమంటి నీ చిరునామా వెదికాను
జగతిలో శ్రేష్ఠమైనవన్నీ జ్యేష్ఠలో పదిలపరచాను
ఆషాడమేఘాల అనురాగపరిష్వంగంలో
నీ అందెల నిక్వాణం విని నిదురమరచాను
భారమైన హృదయం ఆవిరైన ఆర్ణవమైతే
కురిసిన శ్రావణ భాద్రపద కుంభవృష్టి ధారలలో
తడిసీ,వణికీ తనువంతా నీరైపోయాను
ఆశ్వయుజమంతా ఆశలపందిళ్ళు పరిచి
ఆవిష్కృత  శరద్వెన్నెలలో నీమోము గాంచి
అవ్యక్తానుభూతుల సుడిలో అవశేషమునై నిలిచాను
కార్తీకమంతా కలతల కడగండ్లు రేగి
కాటుక శర్వరిలా కమ్ముకొని భయపెడితే
వెచ్చని నీ ఊసులదీపాలు వెలిగించి ఉపశమనం పొందాను
నీ వియద్వేణియ నుండి విరివిగా రాలిన నీటిబిందువులు
మార్గశీర్షపు తొలిసంధ్యలలో మంచుముత్యాలై మెరిసిపోతే
మత్తెక్కిన మధుపమునై తిరిగి మధురోహలు గ్రోలాను
పుష్యమాసపు ప్రవాసినై
ప్రేమంతా పోగుచేసి పుష్పమాలికలల్లి
భవిష్యత్ బహిర్ద్వారం వద్ద బంట్రోతునై నిలబడితే
తిరస్కరించి,తూలనాడి, తిమిరంలోకి నెట్టేశావు
మాఘమాసపు పెళ్ళిపందిరిపై మందస్మితయై అటు నువ్వు
మొదలు తెగిన వృక్షమునై మృత్యువాకిట ఇటునేను
కఠిన కర్కశ పాషాణ నాతివై నువ్వు కాదు పొమ్మన్నా
కడతేరని ప్రేమతో కొత్తఊపిరిలూదుకొంటాను
నీ పెరటి పున్నమితోటలో
ఫల్గుణినై పరిమళిస్తాను ***



# ఏమో..ఏమో.. డా.మూర్తి జొన్నలగెడ్డ

కొండ బండల చీల్చు పూల గుండెలెంత కఠినమో
పూల చెండుల దాల్చు రాల గుండెలెంత మధురమో
అలలు అలలుగా ఇలను తాకినా వీడనిదేమి మోహమో
తడవ తడవకూ తడిసి మురిసినా తీరనిదేమి తాపమో
పండుటాకుల రాల్చి మోడువారుటనేమి చిత్రమో
పచ్చ చిగురుల దాల్చి ఫలములిచ్చుటకేమి ఆత్రమో
కనులు కాయగా ఎదురుచూసిన దర్శనమేమి భాగ్యమో
మనసులాగినా తిరిగి చూడని మగువలదేమి చోద్యమో
ఏమో ఏమో ఎన్నటికైనా ఎవరికైనా తెలియునేమో! ***



# రసరేఖలు

శ్రీధర్ బొబ్బేపల్లి

**తిరిగి వచ్చితివీవు నా కొరకు నేడు**
వెనుదిరగలేని కడపటి విడిది నాది
కరిగిపోయిన కాలమ్మునరయలేను
విరిసిన విరులు మరిమరి విరియలేవు

**గతదినమ్ములకరుగనా గతమె రాదు**
ఏ దినమ్మననేమగునెవ్వడెరుగు
ఎక్కడే చెట్టు నిల్చునే మొక్క పెరుగు
ఏ లతల్ ప్రాకునే చిరుగాలి వీచు

**కదలిపోయిన వారలక్కడకు రారు**
ఎవరు కన్పింతురో లేరొ యెరుగలేము
చెరిపి తిరిగి వ్రాసిననది జీవితమ్మొ!
చేతనత్వము బాసిన స్మృతియొ! మృతియొ!

**ఒక్క క్షణమది యొక్కటే యొక్క మారె**
ఒక్క యనుభవమొక్కటే యొక్క మారె
ఎన్ని యూపిరులిట్లు లోగొన్న గాని
తరలి పోయిన ప్రాణమ్ము తిరిగి రాదు

**తిరిగి వెన్కకు పోనని తెలియు నాకు**
మరలవలెనన్న యాశయు మదిని లేదు
సత్యమొకటె నీ ప్రేమ యసత్యమగుట
సత్యమై యా యసత్యమె నిత్యమగుట

***

POST YOUR COMMENTS